# కరువు జిల్లా రైతులకు కామధేనువు
# గణేశ్ రకం దానిమ్మ

అనంతపురం, సెప్టెంబర్ 24(టెలిన్యూస్): తీవ్రమైన వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న అనంతపురం జిల్లాలో గతంలో ద్రాక్ష, దానిమ్మ తోటలకు ఎంతో ప్రాముఖ్యం వుండేది. కాలక్రమేణ వర్షాభావం వల్ల రైతులు ఈ తోటలను తగ్గించుకుంటూ వస్తున్నారు. అయితే ఇక్కడి భూసారానికి లభిస్తున్న అతి తక్కువ నీటి వనరులకు శాస్త్రీయ పద్ధతుల్లో మహారాష్ట్రలో ప్రవేశపెట్టడంతో సత్ఫలితాలను అందజేస్తున్న గణేశ్ రకం దానిమ్మను గురించి పరిశోధనలు జరిపిన ద్రాక్షపండ్ల తోటల నిపుణులు శ్రీ పి.సుధాకరరావు ఈ కొత్త రకాన్ని ఇక్కడ వెలుగులోకి తీసుకువచ్చి రైతులను ఆ పంటవైపు మళ్లించారు. ఇంతకు మునుపు పావుగడ, మడకశిరప్రాంతాల్లో దేశవాళీ రకం దానిమ్మను రైతులు సాగుచేసేవారు. రాను రాను వర్షాభావంతో ఆ తోటలు ఎండిపోవడంతో రైతులు దానిమ్మవైపు మొగ్గుచూపలేకపోతున్నారు. పరిస్థితుల్లో పండ్ల తోటల విషయంలో రైతులకు సలహాదారుగా వున్న శ్రీ పి.సుధాకరరావు కొంతమంది ఔత్సాహికులైన రైతులను వెంటబెట్టుకుని తొలుత మహారాష్ట్ర వెళ్ళి అక్కడ వర్షాభావానికి బాగా తట్టుకొని సత్ఫలితాలను అందజేస్తున్న గణేశ్ రకం దానిమ్మ సాగును వారికి తెలిపి ఈ జిల్లాలో వున్న వాతావరణాన్ని బట్టి ఆ పంటను ప్రోత్సహించారు. దాంతో గత రెండున్నర సంవత్సరాలుగా ఈ జిల్లాలో 1200 ఎకరాల వరకూ గణేశ్ రకం దానిమ్మ తోటలు పెంచేందుకు రైతులు ముందుకు వచ్చారు. అంతేకాక అతి తక్కువ నీటితో ఎలాంటి తెగుళ్ళపాలు కాకుండా గణేశ్ రకం దానిమ్మ మంచి ఫలితాలను ఇవ్వడంతో పలువురు రైతులు ఈ పంటపట్ల ఎంతో ఆసక్తి చొరవ కనబరిచారు. ఉత్తర ప్రదేశ్‌లో పండే భేదాన రకం దానిమ్మకన్నా గణేశ్ రకం అధిక ఫలసాయాన్ని అందజేస్తుందని పండ్ల తోటల పెంపకంలో రైతులకు సలహాదారుగా వున్న శ్రీ పి.సుధాకరరావు టెలిన్యూస్ ప్రతినిధికి తెలిపారు.

మహారాష్ట్రలో కూడా అధికంగా వున్న పేపర్ షెర్, మస్తక్, స్పానిష్, రూటే రకం దానిమ్మ కన్నా అనంతపురం జిల్లాలో ప్రవేశ పెట్టిన గణేశ్ రకం దానిమ్మ అధిక దిగుబడి నివ్వగలదని రుజువైంది. వ్యవసాయ శాస్త్రజ్ఞుల పరిశోధనల్లో కూడా జి.కె.వి.కె ఒకటవ రకం, డోలుకో, కె.ఒ ఒకటో రకం దానిమ్మకన్నా గణేశ్ రకం మేలని తేలినట్లు ఎకరాకు 400 చెట్లు నాటిన పక్షంలో 18 నెలల కాలంలో పంట చేతికొచ్చే వీలున్నదని శ్రీ రావు వివరించారు.

ఇక్కడి వాతావరణం దృష్ట్యా ఏటా రెండు పంటలు తీసుకోవచ్చునని ఆయన అన్నారు. సాలీనా ఎకరాకు అన్ని ఖర్చులు పోనూ రూ. 30 వేం దాకా ఆదాయం పొందవచ్చునని, ఈ పంటకు తక్కువ నీరు, సస్యరక్షణ, తక్కువ ఎరువులతో సత్ఫలితాలను, అధిక దిగుబడిని సాధించవచ్చునని ఆయన తెలియజేశారు. అంతేకాక ఏప్రిల్, మే నెలల్లో ఎదిగిన చెట్లకు నీరు ఇవ్వకుండా వాడనివ్వాలని, తిరిగి తొలకరిలో వినుకులకు అవే చిగురించగలవని శ్రీ సుధాకరరావు తెలిపారు. ఈ జిల్లాలో ప్రస్తుతం 1200 ఎకరాల్లో గణేశ్ దానిమ్మ పంట వేశారని, ఈ చెట్లు నాటిన అభ్యుదయ రైతులు శ్రీ యోగీశ్వర నాయుడు, శ్రీ వెంకటేశులు, శ్రీ భాస్కరు, శ్రీ నల్లప్పరెడ్డి మంచి దిగుబడి పొందుతున్నారని, ఔత్సాహిక రైతులు కూడా ముందుకొచ్చి వర్షాభావానికి తట్టుకునే గణేశ్ రకం దానిమ్మ పంట వేయాలని శ్రీ సుధాకరరావు కోరారు. జిల్లాలో ఇటీవల కొందరు స్వార్థపరులు రైతులకు ఇతర రకాల దానిమ్మ మొక్కలను అందజేసి వాటినే గణేశ్ రకంగా చెప్తున్నారని, ఇలాంటి విషయంలో జిల్లా రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖను గానీ లేదా పండ్ల తోటల సలహాదారు శ్రీ పి.సుధాకరరావును గానీ సంప్రదించాలని ఆయన వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, జిల్లావ్యవసాయ శాఖాధికారులు కూడా ఇప్పుడిప్పుడే ఈ కొత్త రకం గణేశ్ దానిమ్మను బాగా ప్రోత్సహిస్తున్నారని ఆయన తెలిపారు.